ప్రజాశక్తి

మంగళవారం 9 డిసెంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఒప్పంద బకాయిలు చెల్లించండి

అదాని గంగవరం పోర్టును ముట్టడించిన నిర్వాసితులు



పోలీసు వలయాన్ని ఛేదించి అదాని గంగవరం పోర్టు గేటును ముట్టడించిన నిర్వాసితులు

ప్రజాశక్తి - గాజువాక

రెండున్నర సంవత్సరాల క్రితం చేసుకున్న ఒప్పందం ప్రకారం తమకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే ఇవ్వాలంటూ అదాని గంగవరం పోర్టు గేటును మత్స్యకార నిర్వాసితులు సోమవారం ముట్టడించారు. తొలుత వారంతా పెదగంట్యాడ హాస్పిటల్ జంక్షన్ నుంచి ర్యాలీగా అక్కడకు బయలుదేరారు. మార్గమధ్యలో పోలీసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పటికీ వెరవకుండా ముందుకు సాగారు. గేటును ముట్టడించే క్రమంలో పోలీసులకు, మత్స్యకారులకు మధ్య వాగ్వాదం నెలకొంది. గేటు వద్ద గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణ సమయంలో నిర్వాసితులైన వారిని పోర్టు యాజమాన్యం తీవ్రంగా మోసం చేసిందని విమర్శించారు. సమస్యలను 64 రోజుల్లో పరిష్కరిస్తామని యాజమాన్యం చెప్పినా నేటి వరకూ కొన్నింటిని పరిష్కరించలేదన్నారు. ఒప్పందం ప్రకారం 499 మంది నిర్వాసిత ఉద్యోగులకు ఒక్కొక్కరికీ రూ.27 లక్షలు చెల్లించాల్సి ఉండగా యాజమాన్యం రూ.25 లక్షలు మాత్రమే చెల్లించి, మిగిలిన రూ.2 లక్షలు చెల్లించకుండా ఉద్యోగులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కొంతమందికి రూ.5 లక్షలు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకుందన్నారు. ఇదిలా ఉండగా నిర్వాసిత ఉద్యోగుల సమస్యలపై విశాఖ డిప్యూటీ మేయర్, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి స్పందించారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఆయన యూనియన్ నాయకులతో సమావేశమయ్యారు. పోర్టు యాజమాన్యాన్ని సంప్రదించారు. నిర్వాసిత ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవని తెలిపారు. మిగిలిన రూ.2 లక్షలు ఇవ్వాలని, ఇతర ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. యాజమాన్యం రెండు వారాల గడువుకోరింది. దీంతో మత్స్యకార నిర్వాసిత ఉద్యోగులు ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



మేరీమాత ఉత్సవ ఊరేగింపులో భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ఘనంగా కొండగుడి ఉత్సవం

పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని పాత పోస్ట్ ఆఫీస్ ప్రాంతంలో రోజ్ హిల్స్‌పై ఉన్న మేరీ మాత (కొండ గుడి) ఉత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. విశాఖ జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలిరావడంతో పాత నగరం ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. పాత పోస్ట్ ఆఫీస్ జంక్షన్ నుంచి సెయింట్ అలోషియస్ పాఠశాల వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర భక్తులు బారులు తీరారు. పాత పోస్ట్ ఆఫీస్, అలోషియస్ పాఠశాల, కొండ గుడి రహదారి, ప్రార్థనా మందిరం, లూర్దు మాత గుహల వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. నవదిన ప్రార్థనల కోసం ప్రత్యేక షెడ్లు నిర్మించారు. మేరీమాతకు భక్తులు సమర్పించిన ఆభరణాలతో మేరీమాత దర్శన కార్యక్రమం నిర్వహించారు. మేరీ మాత చరిత్ర, కొండ గుడి ప్రార్థన మందిరం విశిష్టతలను తెలిపే పుస్తకాలు విక్రయించారు.

ఈ సందర్భంగా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉత్సవం కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడిపారు. అమలుద్భవి మాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ కొండాల జోసెఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

విత్తన, విద్యుత్ బిల్లులను రద్దు చేయాలి

వార్త 8లో..

నేటి నుంచి విశాఖ బాలోత్సవం

వార్త 2లో..

ఆదివాసీల ఆత్మబంధువు డాక్టర్ శాస్త్రి

వార్త 4లో..

ఏర్పాట్ల పరిశీలన



ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ సిఐటియు జాతీయ మహాసభ విశాఖ నగరంలో జరుగనుంది. దేశ నలుమూలల నుంచి కార్మికోద్యమాలకు ప్రాతినిథ్యం వహిస్తున్న నాయకులంతా హాజరుకానున్నారు. చివరి రోజు లక్ష మందితో భారీ ర్యాలీ, ఆర్‌కె బీచ్‌లో బహిరంగ సభ ఉండనున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే మహాసభ జయప్రదం కోసం విశాఖలో చకచకా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఏర్పాట్ల పరిశీలనకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు సోమవారం నగరానికి వచ్చారు. ఎయు కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలించారు. నాయకులు కె.లోకనాథం, సిహెచ్.నర్సింగరావు, ఎవి.నాగేశ్వరరావు, జగ్గునాయుడు, కుమార్, కెఎం.శ్రీనివాసరావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఒలింపిక్స్ పతకమే లక్ష్యం

- అథ్లెట్ జ్యోతి ఎర్రాజీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే తన లక్ష్యమని భారత అగ్రశ్రేణి క్రీడాకారిణి జ్యోతి ఎర్రాజీ తెలిపారు. ఒలింపిక్ పతకం సాధించిన తర్వాత ప్రభుత్వ సహకారంతో విశాఖ లేదా రాష్ట్రంలో ఏదో ఒక చోట అథ్లెటిక్స్ అకాడమీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. విశాఖ పోర్టు స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం (సాలగ్రామపురం) ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాలగ్రామపురం పోర్టు స్కూల్ పూర్వ విద్యార్థిని అయిన జ్యోతి ఎర్రాజీ ఈ వేడుకలో పాల్గొని చిన్న నాటి స్నేహితులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోర్టు స్కూల్‌లో చదువుకుని క్రీడల్లో రాణిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఇటీవల అర్జున అవార్డు ప్రకటించినట్లు జ్యోతి తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆమె తన లక్ష్యాన్ని మిత్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆర్.అనిల్ కుమార్, సంయుక్త కార్యదర్శి జి.రమణ బాబు, కోశాధికారి ఎవి.హరి కుమార్ పాల్గొన్నారు.

సరస్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 26 వరకు విశాఖ వేదికగా నిర్వహించనున్న జాతీయ స్థాయి సరస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టీసియన్స్ సొసైటీ) ఎగ్జిబిషన్ - 2025కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. డ్వాక్రా, స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసే నిమిత్తం ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి డ్వాక్రా, స్వయం సహాయక సంఘాల సభ్యులు భాగస్వామ్యం అవుతారని చెప్పారు. వివిధ రకాల వస్తువులు, వస్త్రాలు, ఉత్పత్తులు ప్రదర్శనలో ఉండేలా 250 స్టాళ్లు ఏర్పాటు చేస్తారన్నారు. సరస్ ఎగ్జిబిషన్ నిర్వహణలో అన్ని విభాగాల అధికారులు భాగస్వామ్యమై పటిష్ట ఏర్పాట్లు చేయాలని, విజయవంతంగా జరిపించాలని సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన సమావేశంలో అధికారులను ఆదేశించారు. ఎవరెవరు ఏయే పనులు చేయాలో, ఎలాంటి చర్యలు తీసుకోవాలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సరస్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

దిశానిర్దేశం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉండేందుకు వీలుగా పెందుర్తిలోని టిటిడిసిలో వసతి కల్పించాలన్నారు. వారికి తాగునీరు, ఆహారం ఏర్పాటు చేయాలని, ఉండే చోటు నుంచి ఎగ్జిబిషన్‌కు చేరుకునేలా ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులకు చెప్పారు. అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఎగ్జిబిషన్ జరిగే ప్రాంతంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, జనరేటర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రత్యేక హెల్ప్ డెస్కు ఏర్పాటు చేయాలని, సైనేజ్ బోర్డులు పెట్టాలని చెప్పారు. నోడల్ అధికారి డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతితో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

బ్యాంకర్లతో సమావేశం.. పోస్టర్ ఆవిష్కరణ

ఇదే అంశంపై సోమవారం సాయంత్రం కలెక్టర్ తన ఛాంబర్‌లో బ్యాంకర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కార్యక్రమ నిర్వహణకు పూర్తిస్థాయి సహకారం అందించాలని, స్వయం సహాయక సంఘాలకు తోడ్పాటు ఇవ్వాలని సూచించారు. మైక్రో ఎంటర్‌ప్రైజెస్ స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా రుణ సదుపాయం కల్పించాలని, బ్యాంకు లింకేజీ విషయంలో తగిన విధంగా చొరవ తీసుకుని సహాయపడాలని చెప్పారు. అనంతరం వారందరితో కలిసి సరస్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


వినతులు స్వీకరిస్తున్న రమణమూర్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై సమీక్షించిన ఆయన వివిధ అంశాల్లో అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని, సమస్యల శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు వస్తే ఇక నుంచి ఉపేక్షించేది లేదని కలెక్టర్ ఈ సందర్భంగా తేల్చిచెప్పారు. నిర్ణీత సమయంలో ఫిర్యాదుపై చర్య తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే అర్జీదారునికి ఎందుకు పరిష్కారం కాలేదో సహేతుక కారణాలతో వివరించాలని చెప్పారు.

సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పిజిఆర్ఎస్‌కు ప్రజలు వివిధ సమస్యలపై 292 వినతులు సమర్పించారు. వాటిలో రెవెన్యూ విభాగానికి చెందినవి 108 ఉండగా, జివిఎంసి 83, పోలీస్ విభాగానికి సంబంధించినవి 18, ఇతర విభాగాలకు చెందినవి 83 ఉన్నాయి. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇన్చార్జి డిఆర్ఒ సత్తిబాబు, ఎడిసి వర్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అన్ని విభాగాల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

జివిఎంసిలో..

ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జివిఎంసిలో అన్ని విభాగాలకు కలిపి 86 వినతులు వచ్చాయని జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జివిఎంసి విభాగాధిపతులతో కలిసి నిర్వహించారు.

నేటి నుంచి విశాఖ బాలోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గత రెండేళ్లుగా నగరంలో వినూత్న పద్ధతిలో నిర్వహిస్తున్న విశాఖ బాలోత్సవాన్ని ఈసారి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విశాఖ బాలోత్సవం మూడో పిల్లల పండగ కార్యక్రమంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవానికి స్థానిక గ్రీన్ పార్క్ హోటల్ ప్రాంతంలోని సెంట్ తెలుగు మీడియం స్కూల్ ఈ నెల 9, 10, 11 తేదీలలో వేదిక కానుంది. మంగళవారం ఉదయం 10 గంటలకు ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్, రోటరీ జిల్లా గవర్నర్ వై.కల్యాణ్ చక్రవర్తి, ప్రొఫెసర్ పికె.జోష్ వంటి ప్రముఖులు ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా సాంస్కృతిక, అకడమిక్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్,

ఏర్పాట్లు పూర్తి

సీనియర్స్ విభాగంలో కల్చరల్ విభాగంలో 13, అకడమిక్ విభాగంలో 63 ఈవెంట్స్ ఉంటాయి. వీటిలో పాల్గొంటున్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు, విజేతలకు మెమొంటోలు అందజేస్తారు.

గత ఏడాది నిర్వహించిన రెండో బాలోత్సవం కార్యక్రమానికి నగర పరిధిలోని పాఠశాలల నుంచి 8000 మంది విద్యార్థులు పాల్గొనగా, ఈసారి అంతకంటే ఎక్కువ మంది వస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణలో విశాఖ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జివిఎస్.రాజేశ్వరరావు, అధ్యక్షులు పి.రఘు, ఉపాధ్యక్షులు ఎంవి.జానకిరామ్, డాక్టర్ కె.రమాప్రభ తదితరులు కీలక భూమిక నిర్వహిస్తున్నారు.

శుభం కేఫ్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని బీచ్ రోడ్ ప్రాంతంలోగల శుభం కేఫ్ మల్టీ క్యూసిన్ రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు కల్యాణ్ చక్రవర్తి, అప్పారావుల సారథ్యంలోని బృందం నిర్వహించిన తనిఖీల్లో తీవ్రమైన లోపాలు బయటపడటంతో ఆ హోటల్‌పై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని విశాఖ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.కల్యాణ్ చక్రవర్తి సోమవారం మీడియాకు తెలిపారు తనిఖీల సమయంలో ముందు రోజు ఉదయం వండిన ఫ్రైడ్ రైస్, నూడిల్స్, పాస్తాను డీప్ ఫ్రీజ్‌లో నిల్వ ఉంచినట్లు అధికారులు గుర్తించారు. వాటిని మరుసటి రోజు వినియోగదారులకు

కేసు నమోదు

విక్రయించేందుకు సిద్ధం చేస్తున్నట్లు తేలింది. వండిన ఆహారాన్ని ఈ విధంగా నిల్వ చేసి విక్రయించడం ప్రజారోగ్యానికి తీవ్ర ప్రమాదమని, అదేవిధంగా రెస్టారెంట్ ఆవరణలో సానిటరీ కండిషన్స్ దారుణంగా ఉన్నాయని, ముఖ్యంగా వంట గదిలో బొద్దింకలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

ఆహార భద్రతా ప్రమాణాలను తీవ్రంగా ఉల్లంఘించిన ఈ చర్యలపై అధికారులు కఠినంగా స్పందించారు. హోటల్ యజమానులపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు.

అద్దె బకాయి చెల్లించని వ్యక్తిపై చర్య తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : షాపును లీజుకు తీసుకొని లీజు గడువు ముగిసినప్పటికీ ఖాళీ చేయకుండా, మరి కొంతకాలం షాపులో కొనసాగుతూ నెలనెలా చెల్లించాల్సిన అద్దె చెల్లించకుండా, ఆకస్మికంగా షాపు ఖాళీ చేసి నష్టం వాటిల్లేలా చేసిన మహమ్మద్ ఇక్బాల్‌పై తగు చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని షాపు యజమాని కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, విశాఖపట్నం ఆశీలమెట్ట ప్రాంతంలో నివసిస్తున్న తమకు, ఆశీలమెట్ట నుంచి రామాటాకీస్ వెళ్లే మార్గంలో షాపు ఉందని దీనిని 2008లో మొహమ్మద్ ఇక్బాల్ అనే వ్యక్తికి లీజుకు ఇచ్చామన్నారు. ప్రారంభంలో నెలనెలా అద్దె సక్రమంగా చెల్లించారన్నారు. లీజు గడువు ముగిసి 10 సంవత్సరాలైన తర్వాత షాపు ఖాళీ చేయమని అడిగితే ఖాళీ చేయలేదని, కొన్నాళ్ళు కొనసాగుతానని చెప్పడంతో అంగీకరించామన్నారు. సక్రమంగా అద్దె చెల్లించని కారణంగా ఖాళీ చేయమని చెప్పడం జరిగిందన్నారు. అయితే తనకు రూ.20 లక్షలు గుడ్‌విల్ ఇస్తే ఖాళీ చేస్తానని చెప్పాడని, అందుకు తాము అంగీకరించలేదన్నారు. ఈ నేపథ్యంలో తమకు చెప్పకుండానే గత నెలలో షాపు ఖాళీ చేసి వెళ్ళిపోయాడన్నారు. ఆగస్టు నుంచి అద్దె బకాయి ఉందన్నారు. ఇప్పటికైనా ఆయనపై చర్య తీసుకొని తమకు న్యాయం చేయాలని కిరణ్ కుమార్ కోరారు.

శ్రీ కనకమహాలక్ష్మి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత నగరం బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. అక్టోబర్ 29 నుండి డిసెంబర్ 8వ తేదీ వరకు 40 రోజులకుగాను జరిగిన లెక్కింపులో నగదు రూపంలో రూ.67 లక్షల 78 వేల 784 వచ్చిందని దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కె.శోభారాణి మీడియాకు తెలిపారు. బంగారం 47 గ్రాములు 500 మిల్లీగ్రాములు, వెండి 669 గ్రాములు వచ్చిందని, అవి కాకుండా ఫారెన్ కరెన్సీ కూడా వచ్చిందని తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కె.శోభారాణి, ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్, ఉత్సవ కమిటీ సభ్యులు కందుల నాగరాజు, ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారులు ఎస్.ఆనంద్ కుమార్, కె.రాజేంద్ర కుమార్, పర్యవేక్షకులు ఎస్.కనకరాజు, కె.పద్మజ, డి.రాజు, యుబిఐ బ్రాంచ్ మేనేజర్, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా 'మహాపరినిర్వాణ దివస్'

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బి. ఆర్. అంబేద్కర్ 'మహాపరినిర్వాణ దివస్'ను సోమవారం వాల్తేరు డివిజన్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా, ఏడీఆర్ఎం (ఆపరేషన్స్) కె.రామారావు, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జుసుఫ్ కబీర్ అన్సారీ, ఇతర శాఖాధికారులు, సిబ్బందితో కలిసి డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వాల్తేరు డివిజన్‌లోని ఉప-డివిజన్ కార్యాలయాలలో కూడా మహాపరినిర్వాణ దివస్‌ను పాటించారు.

నేటి నుంచి సౌత్‌జోన్ టిటి పోటీలు

గీతం వేదికగా మూడు రోజులపాటు అంతర వర్సిటీ పోటీల నిర్వహణ

ప్రజాశక్తి-మధురవాడ : అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఎఐయు) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఈనెల 9 నుంచి 11 వరకు సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల టేబుల్‌టెన్నిస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు గీతం క్యాంపస్ లైఫ్ అసోసియేట్ డీన్ అరుణ్‌కార్తీక్ తెలిపారు. సోమవారం గీతం వర్సిటీలో పోటీల వివరాలను వెల్లడించారు. విశాఖ పట్నం టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సాంకేతిక సహకారంతో నిర్వహించే ఈ పోటీల్లో దక్షిణ భారత దేశంలోని 84 విశ్వవిద్యాలయాల నుంచి 400 మంది క్రీడాకారిణులు పాల్గొంటారని వీరిలో 50 మంది జాతీయ స్థాయి క్రీడాకారులున్నారని తెలిపారు. సౌత్ జోన్ పోటీల విజేతలు త్వరలో హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే ఫైనల్ పోటీలలో టైటిల్ కోసం తలపడతారన్నారు. గతేడాది విజేతలుగా నిలిచిన 4 జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌లో పాల్గొంటాయన్నారు. ఈ పోటీలలో టేబుల్ టెన్నిస్ వరల్డ్ ర్యాంకింగ్ 84వ స్థానం క్రీడాకారిణి యశశ్విని గోర్పాడే ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారని తెలిపారు. పోటీలకు విస్తృత ఏర్పాట్లు చేశామన్నారు. విలేకరుల సమావేశంలో గీతం క్రీడా విభాగం డిప్యూటీ డైరక్టర్ ఎన్. శ్రీనివాస్, సీనియర్ మేనేజర్ కె.తపస్వి, ఎస్.రితేష్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీన్ అరుణ్‌కార్తీక్

10న ఫేషియల్ సర్జరీపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-తగరపువలస : అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, ఓరల్ మ్యాక్సిల్లో ఫేషియల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈనెల 10న ప్రి కాన్ఫరెన్స్ ప్రోగ్రామ్స్ నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపల్ వంశీకృష్ణరెడ్డి తెలిపారు. కాలేజీ సిఇఒ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఒడి. డాక్టర్ వెంకటరమణమూర్తి పాల్గొంటున్న కార్యక్రమంలో ముఖగాయాలు, ఆర్థోగ్నాథిక్ సర్జరీ, ఆధునిక రీజెనరేటివ్ టెక్నాలజీలు వంటి అనేక ఆధునిక అంశాలపై నిపుణుల స్పెషల్ లెక్చర్లు, ఆధునిక టెక్నిక్స్‌పై హ్యాండ్స్ ఆన్ సెషన్లు .వర్క్‌షాపులు, కేస్ డిస్కషన్లు, ఇంటరాక్టివ్ .సెషన్లు, పీజీ స్టూడెంట్స్‌కు శాస్త్రీయ అవగాహన పెంపొందించే లక్ష్యంతో విద్యార్థులు, వైద్యులు, పరిశోధకులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

పిజిఆర్ఎస్‌లో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-కొమ్మాది: జివిఎంసి రెండో జోన్‌లో సోమవారం జెడ్‌సి ఒమ్మి అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 12 వినతులు స్వీకరించారు.విభాగాల వారీగా ఇఇ (వర్క్స్), వాటర్ సప్లై, రెవిన్యూ విభాగాలకు మూడేసి, ప్రణాళికా, పబ్లిక్ హెల్త్, యుసిడి విభాగాలకు ఒక్కో అర్జీ వచ్చింది. స్వీకరించిన దరఖాస్తులపై సమగ్ర విచారణ జరిపి,తగు చర్యలు తీసుకోవడానికి సంబంధిత విభాగాల అధికారులకు జెడ్‌సి ఆదేశించారు.

భీమిలిలో ఒకే ఒక్క అర్జీ

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఒకే అర్జీ అందినట్లు జెడ్‌సి ఒమ్మి అయ్యప్ప నాయుడు తెలిపారు. దానిపై తగు చర్యలకు సంబంధిత అధికారులకు నివేదించారు.

'స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్' ప్రారంభం

ప్రజాశక్తి- మధురవాడ : దేశంలోని యువతలో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎఐసిటిఇ) జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' ఫైనల్ పోటీలు సోమవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్ పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 25 విద్యార్థి బృందాలు, 171 యువతీ యువకులు హాజరయ్యారు. పోటీలను గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు ప్రారంభించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, విశాఖ నోడల్ సెంటర్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు, గీతం విడిసి కోచ్ బి.రాజ్‌కుమార్ కోఆర్డినేటర్‌లు వివేక్, అభితేజ్ పాల్గొన్నారు.

'స్టీమ్ వీక్' మీట్‌లో ఓ క్రిడ్జి విద్యార్థులు



స్టీమ్ వీక్ మీట్‌లో పాల్గొన్న ఓ క్రిడ్జి విద్యార్థులు

ప్రజాశక్తి తగరపువలస : మాసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహించిన సైన్స్. టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఆర్ట్స్, మ్యాథమెటిక్స్ (స్టీమ్) వార్షిక వీక్ మీట్‌లో : స్థానిక ఓక్రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థినులు మహాలక్ష్మి, షైలీ పాల్గొన్నారనిపాఠశాల ప్రిన్సిపల్ శైలా భమిడిపాటి తెలిపారు నార్డ్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ మీట్ సహకారంతో నిర్వహించే ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ప్రపంచ వ్యాప్తంగా ఎన్ఎఇ పాఠశాలల నుండి ఎంపికైన విద్యార్థులు పాల్గొంటుండగా, స్థానిక ఓ క్రిడ్జి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలతో ఇంటరాక్ట్ అవడం,.అధునాతన పరిశోధనా ప్రయోగశాలలను సందర్శించడం. సహప్రాజెక్టుల్లో పనిచేయడం. క్లైమేట్ యాక్షన్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ ప్రవేశ అవకాశాలు, అకడమిక్ కల్చర్ ఇన్నోవేషన్ వాతావరణంపై అవగాహన ద్వారా ఎంతో ఉత్సాహం, కొత్త ఆలోచనలు, ప్రేరణతో తిరిగి వచ్చారన్నారు.

నైపుణ్యాభివృద్ధితో విస్తృత అవకాశాలు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రస్తుత పోటీ ప్రపంచంలో మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుంటే మంచి ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీల ప్రిన్సిపల్స్ డాక్టర్ జిఎస్‌కె. చక్రవర్తి, ప్రొఫెసర్ డి. దీపక్ చౌదరి, అన్నారు. సోమవారం డాక్టర్ బుల్లయ్యకాలేజీలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఐసిటి అకాడమీ సంయుక్త ఆధ్వర్యాన, వారి కార్పొరేట్ సామాజిక బాధ్యతగా 'ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయబిలిటీ' నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వళనలతో వారు ప్రారంభించారుయువత ఉపాధి అవకాశాలను పెంపొందించడం, పరిశ్రమలకు అనుగుణమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఎంపికైన 130 మంది విద్యార్థుల్లో 65 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు పైథాన్ వెబ్ డెవలపర్ ట్రాక్, 65 మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ప్రీమియర్ బ్యాంకర్ ట్రాక్ శిక్షణనివ్వనున్నారు. విద్యార్థుల పనితీరు సామర్థ్యం, విశ్వాసం వృత్తి సంసిద్ధతను పెంచేందుకు 15 రోజులపాటు 80 గంటల టెక్నికల్ ట్రైనింగ్ 20 గంటల సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు.

ఈ సందర్భంగా ఐసిటి అకాడమీ, ఎపి హెడ్ డాక్టర్ ఎస్.దినకర్ రెడ్డి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా పరిశ్రమలు, అకాడమియా అంతరాన్ని తగ్గించేందుకు ఐసిటి అకాడమీ చేస్తున్న కృషిని వివరించారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలు కార్యదర్శి డాక్టర్ జి. మధుకుమార్ మాట్లాడుతూ, అరుదైన అవకాశాన్ని విద్యార్థులు క్రమశిక్షణతో ఉపయోగించుకోవాలని సూచించారు. డి. భుజంగరావు కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కార్యక్రమాన్ని నైపుణ్యాభివృద్ధి కేంద్రం, డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల సమన్వయంతో నిర్వహిస్తున్నాయి.

భక్తిశ్రద్ధలతో సింహాద్రి అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆర్జిత సేవల్లో భాగంగా సోమవారం దేవస్థానంలో స్వామి నిత్య కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోవిందరాజస్వామి ఉత్సవమూర్తిని, ఉభయ దేవేరులైన శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో సహా కల్యాణ మండపంలో ప్రతిష్టింపజేసి, అధిష్ఠింపజేశారు. పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన కల్యాణక్రతువును వైభవంగా నిర్వహించారు.. అనంతరం, భక్తులందరికీ వేదాశీర్వచనాలు అందజేసి, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులందరికీ స్వామి అంతరాలయ దర్శనం కల్పించారు.

వైసిపి కోటి సంతకాల ప్రతులు అందజేత

ప్రజాశక్తి - ఆరిలోవ : వైద్యకళాశాలలను పిపిపి విధానంలో ప్రయివేటీకరణకు నిరసనగా సోమవారం 74వ వార్డు అధ్యక్షులు పతివాడ కనకరాజు ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్ కెఎస్. చలంతో కలిసి కోటి సంతకాల సేకరణ చేపట్టారు. వార్డు అధ్యక్షులు పతివాడ కనకరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో పేదపిల్లలకు వైద్యవిద్య, మెరుగైన వైద్యసేవలు దూరమౌతాయన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైసిపి శ్రేణులను ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కెఆర్ పాత్రుడు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పతివాడ వెంకటలక్ష్మి, వైదా నారాయణరావు, అబ్దుల్ సయ్యద్ రవూఫ్, సత్యనారాయణ, రాము, రామాయమ్మ పాల్గొన్నారు.

తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు బాలాజీనగర్‌లో వైసిపి వార్డు ప్రెసిడెంట్ జగ్గుపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో కోటి సంతకాలు సేకరణ చేపట్టారు. భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరి సహస్ర, భాగం స్వాతి, సుధాకర్ రోక్కం శ్రీను, సృజన.చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలో వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన కోటిసంతకాల సేకరణ విజయవంతంగా పూర్తిచేసి, ఎనిమిది వేల ప్రతులను సోమవారం ఆనందపురం వైసిపి కార్లాయయంలో ఎంపిపి కె.రాంబాబు, పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో నియోజకరవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనుకు అందజేశారు.


సంతకాల సేకరణ ప్రతులు అందజేస్తున్న పద్మనాభం నేతలు

ఆనందపురం : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం ఆనందపురంలో పార్టీ కార్యాలయంలో అన్ని గ్రామ పంచాయతీలలో కోటి సంతకాల సేకరణ ప్రతులను చందక గ్రామ సర్పంచ్ బంక శ్రీను ద్వారా స్వీకరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు మజ్జి వెంకట్రావు, కలిమి గంగరాజు, చందక సూరిబాబు, పాండ్రంకి శ్రీను, కోరాడ ముసలినాయుడు, రెల్లి గురునాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రామాలయం పైనుంచి పడి విద్యార్థి మృతి


కోన దినేష్ (ఫైల్)

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఆటవిడుపుగా రామాలయంపైకి ఎక్కిన ఓ విద్యార్థి దురదృష్టవశాత్తు కాలుజారి కిందపడటంతో తలకు తీవ్ర గాయమై మృతి చెందిన సంఘటన దేవరాపల్లి మండలం గరిసింగిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. దేవరాపల్లి మండలం తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కోన దినేష్ (13) ఆదివారం సాయంత్రం ఆటవిడుపుగా గరిసింగిలోని రామాలయంపైకి ఎక్కాడు. ఈ క్రమంలోనే దినేష్ కాలుజారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో ఆ బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాడు. దీనిని గమనించిన స్థానికులు హుటాహుటిన 108 వాహనంలో దినేష్‌ను విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యంలో దినేష్ మృతి చెందాడు. దినేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. దినేష్ తల్లిదండ్రులు కోన లక్ష్మి, చిన నర్సిబాబు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు కుమారుల్లో రెండో కుమారుడు దినేష్ మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సోమవారం సాయంత్రం దినేష్ అంత్యక్రియలు తెనుగుపూడి గ్రామంలో జరిగాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వి.సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు మేర్లిన్ కే హోటల్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి పోలీసుల కథనం ప్రకారం.. రుషికొండ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన నలుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు కారులో భీమిలి వస్తుండగా, ఒక్క సారిగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొని, తర్వాత ఎదురుగా వస్తున్న మరో కారును, అక్కడ ఆగి ఉన్న ఆటోను కూడా ఢీకొంది.ఈ ప్రమాదంలో ఆటో లో ఉన్న అంజలీ కుమారికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి- కొమ్మాది : కొమ్మాది జంక్షన్ సమీపంలో ఉన్న కార్పెంటర్ కాలనీలో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక ఇంట్లోని రిఫ్రిజిరేటర్‌లో మంటలు చెలరేగి, ఇల్లంతా వ్యాపించాయి.ప్రమాదాన్ని గమనించిన స్థానిక ప్రజలు వెంటనే స్పందించి, మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను నియంత్రించారు. ప్రమాదంలో ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది.

పోగొట్టుకున్న బ్యాగ్ అందజేత

ప్రజాశక్తి-సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో పోగొట్టుకున్న బ్యాగును సంబంధిత మహిళలకు రైతుబజారు ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి అందజేశారు. సోమవారం రైతుబజారుకు వచ్చిన మహిళ బ్యాగ్‌ను పోగొట్టుకుంది. దీనిపై ఇఒకు ఫిర్యాదు చేయగా, ఆయన రైతుబజారులో వాకబ్ చేశారు. ఒక దుకాణం వద్ద బ్యాగ్ ఉందని సంబంధిత రైతు చెప్పి అందజేయడంతో, దాన్ని పరిశీలించిన ఇఒ కృష్ణమూర్తి, నిర్ధారించుకున్నాక పోగొట్టుకున్న మహిళలకు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచల క్షేత్రంలో సింహగిరిపై నిత్యం నిర్వహించే సింహాద్రినాథ శాశ్వత అన్నప్రసాద పథకానికి తూర్పు గోదావరి జిల్లా, పెద్దాపురానికి చెందిన పాలకుర్తి కనక సత్తిరాజు దంపతులు సోమవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. దేవస్థానం కార్యాలయ ప్రాంగణంలోని ప్రోటోకాల్ ఆఫీస్‌లో విరాళాన్ని అందజేసి రశీదు అందుకున్నారు. ఈసందర్భంగా దాతలకు ప్రొటోకాల్ పర్యవేక్షణాధికారి పి. సునీల్‌కుమార్, సీనియర్ సహాయకులు సూర్యనారాయణ విరాళబాండ్‌ను అందజేశారు. అనంతరం, దాతలకు ప్రత్యేక స్వామి దర్శనం కల్పించి, శేష వస్త్రంతో సత్కరించారు. ప్రసాదాలను అందజేశారు.

టెట్ మినహాయించాలని ఆందోళనలు



ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి గాజువాక.: 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి మినహాయించాలని యుటిఎఫ్ నేతలు కోరారు. సోమవారం ఉపాధ్యాయుల సమస్యలపై మండల విద్యాశాఖాధికారి డివి త్రినాధకు యుటిఎఫ్ గాజువాక మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇమంది ప్రసాద్, సబ్బారావు నూకరాజు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 9,10 తేదీలలో పాత తాలూకా కేంద్రాల్లోనూ, ఈనెల 18వ.తేదీన జిల్లా కేంద్రంలోనూ నిరసన చేయనున్నట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ గౌరవాధ్యక్షుడు కె.మురళీకృష్ణ, సహాధ్యక్షులు బి.సుగుణ, కోశాధికారి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు అపరంది, .లక్ష్మి కుమారి, అనితకుమారి,. హుస్సేన్‌బీ, రవికుమార్, సూర్యకుమారి, దుర్గాదేవి ఉన్నారు.

13న ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధారలోని లయన్స్ కేన్సర్ జనరల్ హాస్పిటల్లో ఈనెల 13న శనివారంఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత మెగావైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్ట్ బి ఉమామహేశ్వరరావు తెలిపారు. వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్లు, ఆంకాలజీ, డెర్మటాలజీ, ఇఎన్‌టి, యూరాలజీ, గైనకాలజీ, జనరల్ సర్జన్, జనరల్ ఫిజీషియన్ వంటి స్పెషలిస్ట్ వైద్యనిపుణులు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు. చర్మ వ్యాధులు సహ వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రత్యేక వైద్యసేవలు, సూచనలు అందజేస్తారని,ఈ ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఉమామహేశ్వరరావు కోరారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ


ప్రజాశక్తి- వేపగుంట : ప్రహ్లాద పురంలోని బంగారు తల్లి వృద్ధాశ్రమంలో ఉన్న 40 మంది వృద్ధులకు పద్మనాభ పురం శ్రీధర్మ శాస్త్ర అయ్యప్పపీఠం కె.కనకరాజు (రాజన్న) స్వామి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు.



అనాథలకు పండ్లు ఇస్తున్న రాజన్న

అన్నసమారాధన

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 96 వ వార్డు ద్రోణంరాజు నగర్ రెల్లి కాలనీలో వెలసిన పోలిమాంబ అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైసిపి పార్వతీపురం మన్యం జిల్లా పరిశీలకులు శరగడం చిన అప్పలనాయుడు పాల్గొని అన్నసంతర్పణ ప్రారంభించారు.రెండు వేలమంది పైగా భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, శ్రీను, ఎం శ్రీను, శంకరరావు, కృష్ణ అప్పారావు, పైడిరాజు, ఈశ్వరరావు ఎస్ అర్జున పాల్గొన్నారు



అన్నసమారాధనలో పాల్గొన్న చిన అప్పలనాయుడు

ఆదివాసీల ఆత్మబంధువు డాక్టర్ శాస్త్రి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : గిరిజన సంస్కృతి, సంక్షేమంపై అనేక పుస్తకాలు రచించిన గొప్ప వ్యక్తి డాక్టర్ వివిఎన్‌వికె శాస్త్రి అని, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర కొనియాడారు. సోమవారం హైదరాబాదులో కన్నుమూసిన డాక్టర్ శాస్త్రి సంస్మరణ కార్యక్రమాన్ని కంచరపాలెం బిఎన్‌ఆర్ భవనంలో నిర్వహించారు.ముందుగా డాక్టర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, డాక్టర్ వివిఎన్‌వికె శాస్త్రి గిరిజన సంక్షేమ శాఖలో ఏటూరునాగారం ఐటిడిఎ పిఒగా పనిచేశారన్నారు. సెంటర్ ఫర్ ట్రైబల్ రీసెర్చ్ అండ్ కల్చరల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేశారన్నారు. గిరిజన సంస్కృతి, సంక్షేమంపై అనేక పుస్తకాలు రాశారని,. బాక్సైట్ తవ్వకాలపై ప్రభుత్వం నియమించిన కళాకమిటీలో సభ్యుడిగా ఉంటూ బాక్సైట్ త్రవ్వకాల వలన ఆదివాసీలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆదివాసీల పక్షాన నిలబడ్డారన్నారు.1982లో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో గిరిజనుల భూములను గిరిజనేతరుల ఆక్రమణకు వ్యతిరేకంగా పోలీసు కాల్పుల్లో 25 మరణించారన్నారు. ఆ సమయంలో విచారణ అధికారిగా కేంద్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో ఆయన సభ్యుడిగా పనిచేశారన్నారు.జిఒ3 చట్టబద్ధత కల్పించడంలో కీలకపాత్ర వహించారన్నారు 1/70, పీసా, అటవీహక్కుల చట్టం అమలుకు ఎంతో కృషి చేసిన ఆదివాసీ ఆత్మ బంధువైన డాక్టర్ శాస్త్ర మరణం ఆదివాసీ సమాజానికి తీరనిలోటన్నారు. గిరిజన ఉద్యమాలకు సలహా ఇచ్చేవారని,మార్గనిర్దేశం చేసేవారన్నారు.గిరిజన సమస్యలపై 10 పుస్తకాలు ప్రచురించారని, 100 వ్యాసాలు రాశారని తెలిపారు. తుదిశ్వాస విడిచేవరకు గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణకు గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశం కల్పించాలని, నిరంతరం ఆదివాసీ ప్రజల పక్షాన నిలబడ్డారన్నారు. డాక్టర్ శాస్త్రి ఆశయ సాధనకు ఆదివాసీ యువత పోరాడాలని ఆదివాసి గిరిజన సంఘం తరపున విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.చిన్నం నాయుడు, విశాఖ జిల్లా కార్యదర్శి జి.వి రమణమూర్తి. సహాయ కార్యదర్శి ,సిహెచ్ కోటిబాబు పాల్గొన్నారు.



డాక్టర్ శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సురేంద్ర, తదితరులు

అప్పలరాజుకు సాహితీ పురస్కారం

ప్రజాశక్తి- కలెక్టరేట్ : నగరానికి చెందిన, సాహిత్య వేత్త, అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అమరజీవి తుమ్మల వెంకటరామయ్య స్మారక సాహితీ పురస్కారానికి ఎంపిక అయ్యారు. అరసం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. హనుమంతరావు తెలిపిన వివరాల ప్రకారం,. గుంటూరు లాడ్జ్ సెంటర్‌లో జరుగుతున్న విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో ఈనెల 13న అరసం గుంటూరుశాఖ, విశాలాంధ్ర విజ్ఞానసమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగేనభలో "తుమ్మల వెంకటరామయ్య స్మారక సాహితీ పురస్కారం-2025"ను కవి, కథ, గేయరచయిత అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పలఅప్పలరాజుకు అందజేయనున్నట్లు ప్రకటించారు. సభలో ప్రముఖులు అప్పలరాజును సత్కరించి రూ.5 వేలు వేలు నగదు జ్ఞాపిక అందజేస్తారని తెలిపారు. విశాఖపట్నం ఈస్టర్న్ నవల్ కమాండ్ డిఫెన్స్ ఫైర్ సర్వీస్‌లో స్టేషన్ ఆఫీసర్‌గా పనిచేసి ఉద్యోగవిరమణ చేసిన అప్పలరాజు, అభ్యుదయ రచయితల సంఘంలో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. శబ్ద చిత్రం, అవతలి వైపుకే వంటి కవితా సంపుటాలు, రోడ్డు ప్రమాదం, మరో గోళంలోకి, ధీర వంటి కవితలు ప్రచురించారు. అప్పలరాజు లలిత గీతాలు ఆకాశవాణిలో ఈ మాసపు పాటలో ప్రసారమయ్యాయి. రంగ స్థల శ్రావ్య రూపకాలు వెలువ రించారు. పర్యావరణం, ఎయిడ్స్, పల్స్ పోలియో వంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజల్లో చైతన్యం కలిగించే నాటికలు రాశారు. అరసం పక్షాన అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించిన అప్పలరాజుకు సాహితీ పురస్కారం ప్రకటించడంపై పలువురు హర్షం ప్రకటించారు



ఉప్పల అప్పలరాజు

సందడిగా కెకె.రాజు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు పుట్టినరోజు వేడుకను పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. భారీ కేకును కట్‌చేసి అభిమానులకు పంచారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి ముఖ్యనేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కెకె.రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు గుడివాడ అమర్నాథ్, పసుపులేటి బాలరాజు, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తైనాల విజయకుమార్, తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, నియోజకవర్గ సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, తిప్పల దేవన్ రెడ్డి, మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.



రాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతున్న నేతలు

అప్పన్నను దర్శించుకున్న కెకె.రాజు

సీతమ్మధార : సోమవారం పుట్టినరోజును జరుపుకున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు కెకె.రాజు ముందుగా సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నారు. మురళీ నగర్‌వైభవ్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, 14వ వార్డు కార్పొరేటర్ కణరి అనిల్‌కుమార్ రాజు, వైసిపియువజన విభాగం జోనల్ అధ్యక్షుడు అంబటి శైలేష్ పాల్గొన్నారు.

చలో ఢిల్లీ ఆందోళనకు పెన్షనర్లు



రైల్వేస్టేషన్‌లో నినాదాలు చేస్తున్న పెన్షనర్లు

ప్రజాశక్తి-తగరపువలస : కనీస పెన్షన్ రూ.9వేలు అమలు, ఇతర సమస్యల పరిష్కారానికి జాతీయ పెన్షనర్ల సంఘం పిలుపుమేరకు చేపట్టే చలో ఢిల్లీ ఆందోళనకు సోమవారం చిట్టివలస జూట్ మిల్లు పింఛన్లుదారుల సంఘం ప్రధాన కార్యదర్శి దామోదర్ బాబాజీ ఆధ్వర్యంలో పలువురు పెన్షనర్లు తరలివెళ్లారు. చలో ఢిల్లీకి బయలుదేరిన పెన్షనర్ల సంఘం నాయకులు రైల్వేస్టేషన్‌లో తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఛలోఢిల్లీ ఆందోళనకు సాయం అందించిన దాతలకు పెన్షన్‌దారుల సంఘం ప్రధాన కార్యదర్శి దామోదర్ బాబాజీ మిగతా సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, ఎస్‌కె.హుస్సేన్, మోర అప్పలరాజు, రాంబాబు, ఎస్ అప్పలనాయుడు, సూరిబాబు, సత్యం, అప్పలరెడ్డి, డి .పెంటయ్య ఉన్నారు.

క్విస్ట్ టు లెర్న్ సదస్సుకు కెజిబివి విద్యార్థిని

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని పద్మనాభం కెజిబివి పాఠశాల 8వ తరగతి విద్యార్థిని ఒ.వనజ అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీరింగ్ స్కిల్స్‌లో భాగంగా బెంగళూరులో ఈనెల 9 10 తేదీల్లో జరగబోతున్న 'క్విస్ట్ టు లెర్న్' సమ్మిట్‌కు జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికై ఒదని పాఠశాల ప్రిన్సిపాల్ కె. గ్రేస్‌లిల్లీ తెలిపారు. జి రవణమ్మ ప్రోత్సాహంతో గతంలో గీతం యూనివర్సిటీలో జరిగిన హ్యాక్ టు ఫ్యూచర్ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర నుంచి 22 పాఠశాలలు పాల్గొనగా, అందులో కెజిబివి నుంచి ముగ్గురు విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఇద్దరిలో వనజ ఉందని తెలిపారు. 'క్విస్ట్ టు లెర్న్' వంటి ప్రతిష్ఠాత్మక సదస్సుకు ఎంపికైన వనజను 'క్విస్ట్ టు లెర్న్' జిల్లా కోఆర్డినేటర్ కె రమణిచౌదరితోపాటు డిఇఒ ఎన్.ప్రేమ కుమార్, సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా అధికారి డాక్టర్ జె.చంద్రశేఖర్, జిసిడిఒ శ్రీదేవి, ఎస్‌ఎంసి చైర్మన్, సభ్యులు అభినందనలు తెలిపారని ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ తెలిపారు.



వనజను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్యుడు

ప్రజాశక్తి -గాజువాక.: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పెదగంట్యాడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి. హేమలత అన్నారు. సోమవారం గాజువాక చైతన్య మహిళా డిగ్రీ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపు ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారైనా వివిధ రకాల వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. కాలానుగుణంగా ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని కోరారు. శారీరక శ్రమతో పాటు, మానసిక ప్రశాంతత ప్రతి ఒక్కరికి అవసరమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమహాలక్ష్మి పాల్గొన్నారు. పలువురికి బిపి, సుగర్, థైరాయిడ్, ఇతర వైద్య పరీక్షలు చేపట్టారు.

వైద్యరంగ ఉద్యోగుల సమస్యలపై నికరంగా పోరాటం

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : వైద్య ఆరోగ్య రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు సమస్యలపై సిఐటియు నికరంగా నిలబడి పోరాడుతోందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు తెలిపారు. సచివాలయం హెల్త్ సెక్రటరీ నుండి హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) ఎంపిహెచ్ఎ (ఎఫ్)గా ప్రమోషన్ పొందిన ఉద్యోగుల అభినందన సభ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంల సమస్యలపై గత కొన్ని ఏళ్ల గా అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి వారికి ఉద్యోగ భద్రత, పెర్మనెంట్ వంటి వసతుల కల్పనలో కీలక భూమిక వహించామని చెప్పారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రమోషన్ పాలసీ ఆధారంగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 263 మందికి హెల్త్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ రావడం అభినందనీయమని పేర్కొన్నారు. మిగిలిన ఉద్యోగులకు వారి అర్హతను బట్టి వెంటనే ప్రమోషన్లు కల్పించాలన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ మాట్లాడుతూ ఉమ్మడి సచివాలయ హెల్త్ సెక్రటరీల ప్రమోషన్లకై నెలలు తరబడి కృషి చేసినట్లు చెప్పారు. సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి పి.మణి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు కనీస వసతులు కల్పించడంతోపాటు వారిపై పని భారాన్ని తగ్గించాలని, ఇతర సౌకర్యాల్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, యూనియన్ రాష్ట్ర నాయకులు చుక్కల సత్యనారాయణ, కృష్ణమోహన్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.రత్నం, ఆళ్ల దేవకి, కుమారి, ఆళ్ల మహేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డిఆర్‌ఒ తదితరులు

బాల్య వివాహాల నిర్మూలనపై పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : "బాల్ వివాహ్ ముక్త భారత్" 100 రోజుల బాల్య వివాహ నిర్మూలనా కార్యక్రమం గోడపత్రికను సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో "బాల్ వివాహ్ ముక్త భారత్" 100 రోజుల బాల్య వివాహ నిర్మూలనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో డిఆర్వో వై.సత్యన్నారాయణ రావు, జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికార అధికారి ఎన్.సూర్యలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హైమావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయతీలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు దొంగ ఓట్లపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకుడు అర్జిల్లి అప్పలరాజు సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ప్రతి ఎన్నికల సమయంలో స్థానిక నాయకుల అండదండలతో వేరే ప్రాంతాల ప్రజలు నకిలీ ఆధార్ కార్డులు, చిరునామా రుజువులు సృష్టించుకొని గ్రామంలో దొంగ ఓట్లు వేస్తున్నారని తెలిపారు. ఇలాంటి దందాల కారణంగా స్థానిక ప్రజలు భయాందోళనలు చెందుతూ పోలింగ్ బూత్‌లకు రాలేని పరిస్థితులు గత ఎన్నికల్లో ఎన్నోసార్లు తలెత్తాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో చింతకాయల ముత్యాలు, సమ్మంగి అప్పారావు, బొంది దుర్గారావు, సూరాడ మహేష్, సూరాడ అమ్మోరయ్య పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వం నిర్దేశించిన వివిధ శాఖల లక్ష్యాలను పూర్తి చేయడంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం పంచాయతీ రాజ్, డ్వామా, డిఆర్‌డిఎ, విద్యుత్, గ్రామ వార్డు సచివాలయాలు శాఖల అధికారులు, సిబ్బందితో శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, పూర్తి చేసిన పనులపై సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు.

పాత చెరువు వద్ద ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం రెవెన్యూ సర్వేనెంబర్ 83లో ఉన్న పాత చెరువు దూరాక్రమణలు తొలగించాలని కోరుతూ సిపిఐ ఏరియా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కబ్జాదారులకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

డివిఎన్‌లో ఎయు శతాబ్ది ఉత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి వీరు నాయుడు కళాశాల (డివిఎన్)లో ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జీపీ రాజశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అలాగే ఎయు సౌజన్యంతో ఈ నెల 8 నుండి 10వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించే ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంను కూడా వీసీ రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ ఉత్సవాలు సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో 8, 9, 10 తరగతులు విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యసనంపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. డీవీఎన్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ మూడు రోజులపాటు అనకాపల్లి జిల్లా పరిధిలోని అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి. అచ్యుతాపురం వంటి యూనివర్సిటీ అనుబంధ రూరల్ కళాశాలల అధ్యాపకులకు ఆధునిక సాంకేతికతను అందించే ఉద్దేశ్యంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ కోర్సులలో శిక్షణా కార్యక్రమాన్ని యూనివర్సిటీ ఐఐటి ప్రొఫెసర్లచే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం వీసీ రాజశేఖర్, ఏయూ డీన్ డి.లలితా భాస్కరిలను రత్నాకర్ సత్కరించి మెమెంటోలు అందజేశారు. డీవీఎన్ కళాశాల బ్రోచర్‌ను ఆవిష్కంచారు. ఈ కార్యక్రమలో కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్, వైస్ ప్రిన్సిపల్ ఎస్.దయామాధురి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన హోమ్‌గార్డుకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని చోడవరం పోలీస్ స్టేషన్‌లో కమ్యూనికేషన్ హోంగార్డుగా సేవలందించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన చల్లపల్లి రామకోటేశ్వరరావుకు సహచర హోంగార్డుల ఒక రోజు డ్యూటీ అలవెన్స్‌ను విరాళంగా అందించారు. ఈ విరాళం మొత్తం రూ.4 లక్షల విలువైన చెక్కును జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం తన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి సిహెచ్.తిలక్ బాబు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ బి.రామకృష్ణారావు, జూనియర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

రైతులు, మహిళల భద్రతే లక్ష్యం

ప్రజాశక్తి- మునగపాక : రైతులు, మహిళల భద్రతే లక్ష్యంగా రైతు కమతాలలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ అన్నారు. ఈ మేరకు స్థానిక తంపర మూల రైతు సంఘం రైతు కమతాలలో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలను ఆదివారం రాత్రి ఆయన స్విచ్ ఆన్ చేసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పెంటకోట విజయ్, పీఏసీఎస్ అధ్యక్షులు వి.నూకనరసింగరావు, తంపర మూల సంఘం అధ్యక్షులు శరగడం జగన్, టెక్కలి రమణబాబు, కాండ్రేగుల భాగ్యరాజ్, క్రాంతి, రైతులు పాల్గొన్నారు.



టిడిపి నేత సాయికృష్ణను సత్కరిస్తున్న రైతులు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ర్యాలీ, మానవహారం



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యాన పట్టణంలోని కాలేజీ విద్యార్థులు సోమవారం యలమంచిలి ఆర్టీసి కాంప్లెక్స్ నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. అనంతరం తహశీల్దారు వెంకటేశ్వరావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కో-కన్వీనర్ ఎం.బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం వల్ల ఎంతో మంది పేద విద్యార్థులకు వైద్య విద్యకు దూరమవుతుందని తెలిపారు. వైద్యను అభ్యసించాలని అనుకునే విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలోనే నడపాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు దాదాపు రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి ఉందని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. అన్ని సంక్షేమ హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయాలని, పీజీ విద్యార్థులకు శాపంగా మారినటువంటి జీవో నెంబర్ 77ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గౌతం, కృప, రాజేష్, రాఘవేంద్ర, భాగ్య, భవాని పాల్గొన్నారు.

యుటిఎఫ్ టెన్త్ మోడల్ పేపర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం తయారు చేయబడిన పదవ తరగతి మోడల్ టెస్ట్ పేపర్లను సోమవారం అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 10వ తరగతి పరీక్షలకు ముందు విడుదల చేస్తున్న యుటిఎఫ్ ఎస్ఎస్‌సి మోడల్ పేపర్లు విద్యార్థులకు మార్కులు సాధించడంలో ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రతి సంవత్సరం యుటిఎఫ్ మోడల్ పేపర్లు చదివి 80శాతం మార్కులు సాధిస్తూ కార్పొరేట్ పాఠశాల విద్యార్థులతో పోటీపడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు, విద్యారంగ సమస్యలతో పాటు, విద్యార్థుల భవిష్యత్తు కోసం మంచి మార్కుల సాధన కోసం యుటిఎఫ్ కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శి గుత్తుల సూర్యప్రకాష్, వైరాల రమేష్‌రావు, సీనియర్ నాయకులు ఉప్పాడ రాము, మామిడి బాబురావు, రేయ్యి రవికుమార్, బండారు శంకర్, కొమ్మోజు సత్యవేణి, కోరాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



టెన్త్ మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న డిఇఒ, యుటిఎఫ్ నేతలు

సర్పంచ్ చెక్కు పవర్ రద్దుతో ఆగిన జీతాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని మాకవరపాలెం మండలం, జి.కోడూరు పంచాయతీలో సర్పంచ్ చెక్కు పవర్ రద్దు కావడంతో ఈ పంచాయతీలో పనిచేస్తున్న ఐదుగురు పారిశుధ్య కార్మికులు జి.పోతురాజు, ఏ.అప్పారావు, ఏ.బాబ్జి, ఏ.మాణిక్యం, యూ.బాబూరావులకు గత 12 నెలలుగా జీతాలు చెల్లించలేదు. దీంతో వారు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. అనేకమార్లు జిల్లా కలెక్టర్‌కి స్పందనలో దరఖాస్తు చేసుకున్నా నేటికీ జీతాలు చెల్లించలేదు. చెక్ పవర్ పునరుద్ధరించాలని హైకోర్టు నుండి ఉత్తర్వులు వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా జిల్లా అధికారులు పునరుద్ధరణ చేయలేదని, కార్మికులు జీతాలు రావడంలేదని పంచాయతీ సెక్రటరీలు తెలుపుతున్నారు. గత 12 నెలలుగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కార్మికులు జిల్లా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తుంది. పండగలలో కుటుంబాలు పస్తులు ఉంటున్నాయి. వచ్చే క్రిస్మస్ పండుగ పస్తులు ఉండే పరిస్థితి ఉంది. తక్షణమే జీతాలు చెల్లించాలని ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు ములకలాపల్లి అప్పలరాజు, కార్యవర్గ సభ్యులు వై.ఈశ్వరరావు డిమాండ్ చేశారు.

కరాటే పోటీల్లో శ్రీగాయత్రి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం శ్రీగాయత్రి స్కూల్ విద్యార్థులు 30వ జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ చూపించ పలు బహుమతులు సాధించారు. ఖమ్మం వర్తకసంఘ భవనంలో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో కేఏటిఏఎస్ విభాగంలో (జూనియర్స్ సీనియర్స్) సాయి గణేష్, జె.కార్తీక్ సాయి, ఎం.కార్తిక్ సాయి బంగారు పతకాలు, ఎన్. జోషిత్, పి.మోహన ప్రతాప్, వై.ముకేష్ బాబు సిల్వర్ మెడల్స్, కే ప్రవీణ్ ఏ.తనీష్ కుమార్, యూ.మణివర్ధన్, ఏం దుర్గ కార్తికేయ, పి ధనుంజయ్, కే.ప్రియవర్ధన్ గణేష్ బ్రోనజ్ మెడల్ సాధించారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ బి.రామ కుమార్, ప్రిన్సిపాల్ వై.నగేష్, కరాటే మాస్టర్ బి.సూరి అప్పారావు, పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలియజేశారు.



మెడల్స్ చూపుతున్న విద్యార్థులు



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత దంత వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : స్థానిక శ్రీగురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యాన రేగుపాలెంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవ శిబిరంలో భాగంగా సోమవారం శ్రీవిష్ణు డెంటల్ హాస్పిటల్ సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు దంత, చర్మ సంబంధిత వ్యాధులకు చికిత్స, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆర్.మహాలక్ష్మి, పంచాయతీ సెక్రెటరీ సిహెచ్ రవి, ఎన్ఎస్-ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వి.చిట్టిబాబు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పాయకరావుపేట : స్ప్రసెస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా అరట్లకోటలో సోమవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎస్.పూజా సంతోషి, లక్ష్మీనారాయణ డెంటల్ కేర్ ఆసుపత్రి వారు దంత పరీక్షల చేశారు. ఉచితంగా టూత్ పేస్టులు పంపిణీ చేసారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి.అప్పలనరస, వేముల వెంకటేశ్వరరావు, ప్రోగ్రాం ఆఫీసుర్లు పి.భాస్కరరావు, జి.టి నాయుడు, వాలంటీర్లు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ అవర్స్ ప్రారంభం

ప్రజాశక్తి-పాయకరావుపేట : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది టెన్త్‌లో అత్యున్నత ఫలితాల సాధనలో భాగంగా మండల వ్యాప్తంగా ఆదివారం నుంచి పదవ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ ఆరంభించినట్లు స్థానిక ఎంఇఒ రమేష్ బాబు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుండి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు, ఆదివారాలు ఉదయం 9 నుండి 1 గంట వరకు స్టడీ అవర్స్ ఉంటాయని పేర్కొన్నారు.

ప్రజా దర్బార్‌తో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ పనిచేస్తుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక గుండాల జంక్షన్ ఎస్ఆర్ శంకరన్ ఆఫీస్ సోమవారంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా దర్బార్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కొణతాల ప్రభుత్వ అధికారులతో చేపట్టారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పట్టణానికి చెందిన 5 జీవీఎంసీ వార్డుల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకి విన్నవించారు. వాటికి ఎమ్మెల్యే సామరస్యంగా స్పందించి అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రవర్తి, అన్ని విభాగాల గవర్నమెంట్ అధికారులు పాల్గొన్నారు.

చినరాజుకు టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి-పాయకరావుపేట : రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్థానిక టిడిపి నాయకుడు గంపల చినరాజును టిడిపి దళిత నాయకులు ఏడిద సురేష్, ముంజులూరి దుర్గాప్రసాద్ సోమవారం పరామర్శించారు.

పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా సోమవారం అంకుపాలెం గ్రామంలో స్వఛత, పరిశుభ్రత అనే అంశంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పిచ్చమ్మ, సర్పంచ్ నాగులపల్లి రాంబాబు, రామలక్ష్మి, కోమల, సరస్వతి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేత వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి రెవెన్యూ సర్వే నెంబరు 280/1, 281/1, 281/2లో ఉన్న ప్రభుత్వ భూములకు కోర్టు వివాదాలు తేలే వరకు ప్రత్యేకంగా నిఘా విభాగాన్ని ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని, ఫల సాయాన్ని కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు దేవరాపల్లిలో జరిగిన పిజిఆర్ఎస్‌లో సోమవారం ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇతర ప్రాంతాలకు చెందిన కొంత మంది రెవెన్యూ రికార్డుల్లో ఉన్న 281/2లోని 6.88 ఎకారాలను 281/2ఎ అని తప్పుడు రికార్డులు సృష్టించి ఆ భూములను ఆక్రమించారని, ఈ భూములతో పాటు సర్వే నెంబరు 280/1లో క్షత్రియ దేవిసింగ్ అను వ్యక్తికి అసైన్డ్ చేసిన 3.63 ఎకారాల భూమిలో పామ్ ఆయిల్ తోటలు వేశారని పేర్కొన్నారు. వీటిపై అనేక సార్లు ఫిర్యాదులు చేయగా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దర్యాప్తులో ఈ భూములన్నీ ప్రభుత్వ భూములుగా తేల్చి ప్రభుత్వ స్వాధీనంలో ఉంచారని తెలిపారు. దీనిపై సదరు వ్యక్తి వేసిన కేసును చోడవరం మున్సిపల్ సివిల్ జడ్జి కోర్టు కొట్టివేయగా, హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. నాటి నుండి ఈ భూములన్నీ ప్రభుత్వ, రెవెన్యూ అధికారులు స్వాధీనంలో విఆర్వో పర్యవేక్షణలో ఉన్నాయని పేర్కొన్నారు. అయతే రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఆక్రమణదారుడు పామ్ అయిల్ పంటల ఫలసాయాన్ని తీసుకుపోతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ప్రభుత్వ భూములకు, భూముల్లో ఉన్న అన్ని రకాల పంటలకు వెంటనే రక్షణ కల్పించాలని, గెస్ట్ హౌస్ నిర్మాణాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.

మండల సమావేశంలో సమస్యలపై నిలదీత

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఎంపిపి బోకం సూర్యకుమారి అధ్యక్షతన జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో పలు సమస్యలపై సభ్యులు నిలదీశారు. మహిళా మార్ట్ నిధులు గోల్‌మాల్‌పై నిగ్గు తేల్చాలని నారపాడు సర్పంచ్ మామిడి శంకర్రావు వెలుగు ఏపీఎం శ్రీనివాస్‌ను నిలదీశారు. దీనికి పలువురు సభ్యులు మద్దతు తెలిపారు. పంచాయతీల్లో కల్వర్టులు, డ్రైనేజీలు, మట్టి రోడ్ల నిర్మాణ పనులకు ఉపాధి హామీ నిధులు ఎందుకు మంజూరు చేయలేదని ఏపీవో టి.వసంతరావును అసకపల్లి సర్పంచ్ కర్రి నర్సింగరావు, పైడివాడ అగ్రహారం ఎంపీటీసీ సీరం అప్పలరాజు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు ప్రశ్నించారు. పలు ఆర్ అండ్ బి రోడ్లు శిధిలావస్థకు చేరాయని, వాటిని ఎప్పుడు అభివృద్ధి చేస్తారని పలువురు సభ్యులు ఎఈ బాలరాజును నిలదీశారు. గొల్లలపాలెం పంచాయతీ డంపింగ్ యార్డ్‌కి స్థలం కేటాయించాలని సర్పంచ్ మోపాడ అప్పారావు కోరారు. దీనికిపై ఎంపీపీ సూర్యకుమారి స్పందిస్తూ మండలంలోని పలు గ్రామాలలో డంపింగ్ యార్డులకు స్థలాలు కేటాయించాలని డిటిని ఆదేశించారు. డిగ్రీ కళాశాల స్థలం ఆక్రమణలకు గురకాకుండా రక్షించాలని కళాశాల అభివృద్ధి కమిటీ కన్వీనర్ మామిడి శంకర్రావు కోరారు. నారపాడు పంచాయతీలో హెల్త్ సెంటర్‌కు స్థలం కేటాయించాలని, బంగారమ్మ పాలెం, ఇరువాడలో తాగునీటి పథకాలకు కొత్త వాటర్ ట్యాంకులు నిర్మాణం చేయాలని సర్పంచులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, సీనియర్ అసిస్టెంట్ పివి.పంతులు, వైస్ ఎంపీపీలు శరగడం ఝాన్సీలక్ష్మీరాణి రాము, మామిడి లక్ష్మి కొండాజీ, పలు శాఖల అధికారులు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి సూర్యకుమారి

కారుణ్య నియామకాలు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మున్సిపల్ రెగ్యులర్ రిటైర్మెంట్, మరణించిన కార్మికుల స్థానంలో ప్రభుత్వ ఉత్తర్వులననుసరించి వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకంలో ఉద్యోగాలు కల్పించాలని విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవఅధ్యక్షులు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక జీవీఎంసీ అనకాపల్లి జోన్ కమిషనర్ చక్రవర్తికు సోమవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమం లో అధ్యక్షులు ఎర్రం శెట్టి అప్పలరాజు, కార్యదర్శి బంగారి రవికుమార్, నాయకులు శివ మూర్తి, బంగారి శంకర్‌రావు, రెడ్డి జ్యోతి తదితరులు పాల్గొన్నారు

షెడ్యూల్ ప్రాంత పంచాయతీ విస్తరణ దినోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : షెడ్యూల్ ప్రాంతాల పంచాయితీ విస్తరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 23, 24 తేదీల్లో విశాఖపట్నంలో పెస క్రీడలు నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పూజారి శైలజ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాస్థాయి క్రీడలను కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం ఏఎంఏఎల్ కళాశాల క్రీడా మైదానంలో ప్రారంభించారు. కబడ్డీ, గిల్లీ దండా, ఆర్చరీ రికర్వ్ క్రీడలు నిర్వహించారు. పది కిలోమీటర్ల మారథన్ రన్ ను జండా ఊపి ప్రారంభించారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 10న విశాఖ కొమ్మాదిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఎస్‌టియు జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-చోడవరం : ఎస్‌టియు అనకాపల్లి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా చోడవరంకు చెందిన డాక్టర్ ఐవి.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.పరదేశి, రాష్ట్ర కౌన్సిలర్‌గా పివిజిఎన్.గంగాధర్, గౌరవాధ్యక్షులుగా ఆచంట రవి, మహిళా కన్వీనర్‌గా సిహెచ్.సునీత, కోశాధికారిగా జి.అచ్యుతరావు, ఉపాధ్యక్షులుగా కె.ఉదయభాస్కర్, టి.రాజు, అసోసియేట్ అధ్యక్షులుగా టి.భాస్కర్, డి.భీమరాజు, డి.ప్రేమ కుమారు, కార్యదర్శులుగా కే.సూర్య ప్రకాష్, కే.వరహాల దొర, సురేష్ కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికలలో పరిశీలకులుగా వై అప్పారావు వ్యవహరించారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి డిగ్రీ కళాశాల మైదానంలో లోకరెడ్డి రవిచంద్ర నాయుడు స్నేహితులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ఎంపీపీ రాజాన శేషు, పిఎసిఎస్ అధ్యక్షులు గోపీనాథ్, టౌన్ ఎస్ఐ సావిత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ తమ స్నేహితుడు రవిచంద్ర నాయుడు జ్ఞాపకార్థం ఈ నెల 26న ఆయన జయంతి సందర్భంగా ఈ టోర్నమెంట్ ఏర్పాటు చేశామని తెలిపారు. మొత్తం 50 టీములు వచ్చాయని, ఈ నెల 26న ఫైనల్ మ్యాచ్‌తో టోర్నమెంట్ ముగిస్తుందని చెప్పారు. మొదట బహుమతిగా రూ.50 వేలు, రెండవ బహుమతిగా రూ.30 వేలు, మూడో బహుమతిగా రూ.15000, వ్యక్తిగత ప్రతిభ కనపరిచిన బ్యాట్స్‌మెన్, బౌలర్లకు షీల్డ్‌లు ఇవ్వడం జరుగుతందని తెలిపారు.

పిజిఆర్ఎస్‌కు 288 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : పిజిఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారుల సమస్యలను సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పరిలించి వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్, డిఆర్వో వై.సత్యన్నారాయణ రావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 288 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో సిపిఓ జి.రామారావు, డ్వామా, మెప్మా, గృహనిర్మాణ పథక సంచాలకులు పూర్ణిమ దేవి, కె.సరోజినీ, శ్రీనివాస్, డిఈఓ జి.అప్పారావు నాయుడు, డిఎంహెచ్ఒ హైమవతి, జిల్లా ఎక్సైజ్, రవాణా శాఖ అధికారులు వి సుదీర్, జి మనోహర్, జిల్లా సర్వే, భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్ రాజా పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఎస్పీ తుహిన్ సిన్హా మొత్తం 66 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించి 7 రోజుల్లోపు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్పై విశ్వనాథం, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రఘునాథ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : తెలుగుదేశం పార్టీ నాయకులు కొణతాల రఘునాథ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రఘునాథ్ దంపతులు శ్రీభోగలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వారికి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, ధర్మకర్తలు స్వాగతం పూజ అనంతరం శాలువాతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు మద్దాల నారాయణరావు, పెంటకోట అనూష, గణేష్, బుద్ధ భాస్కరరావు, కొణతాల బాల, బుద్ధ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామాలలో ప్రజలకు డయేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చౌడువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రామ చైతన్య తెలిపారు. మండలంలోని గొండుపాలెం గ్రామంలో పారిశుద్ధ్య పనులను సోమవారం దగ్గర ఉండి చేపట్టారు. కాలువలు, మంచినీటి బోర్లు, వాటర్ ట్యాంకు మొదలగు వాటి వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. కాలువలు వద్ద, నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎంపిహెచ్ఓ.సన్యాసిరావు, పీహెచ్ఎన్ కనకవేణు, మలేరియా మండల సబ్ యూనిట్ అధికారి ఎస్వీ రమణ, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు కౌశిక్ ఎంపిక



ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక జివిఎంసి మెయిన్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కౌశిక్ డిసెంబర్ 9 నుంచి 12 వరకు పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా తరపున ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బ్రహ్మాజీ తెలిపారు. ఈ మేరకు సోమవారం కౌశిక్‌ని, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్‌వి నరసింహం అభినందిస్తూ, రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకి, పాఠశాలకి మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు.

రామ్‌కో సిమెంట్ అక్రమాలపై నిరాహార దీక్ష

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం ఏయస్.పేట, గొబ్బురు గ్రామాల పరిధిలో ఉన్న రామ్‌కో సిమెంట్ కంపెనీ అక్రమలపై సోమవారం గ్రామస్తులు జాతీయ రహదారి పక్కన రిలే దీక్ష చేపట్టారు. భూముల కబ్జా, ఇతర అంశాలపై దీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో బి.రమణ, మళ్ల గణేష్, సత్యనారాయణ, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



నిరాహార దీక్ష చేస్తున్న గ్రామస్తులు

పునరావాస కాలనీకి వెళ్లేందుకు గడువు ఇవ్వాలి

ప్రజాశక్తి- నక్కపల్లి :వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా పరిశ్రమల స్థాపన కోసం సేకరించిన భూముల్లో నివాస గృహాలు కోల్పోయిన నిర్వాసితులు పునరావాస కాలనీకి వెళ్లేందుకు గడువు ఇవ్వాలని పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు కోరారు. సోమవారం తహసిల్దార్ నరసింహమూర్తిని కలిసి సమస్యను విన్నవించారు. మండలంలో అమలాపురం, వేంపాడు, డిఎల్‌పురం, చందనాడ, బుచ్చిరాజుపేట పంచాయతీ పరిధిలో నివాస గృహాలు కోల్పోయిన నిర్వాసితులకు పెదబోదుగల్లం వద్ద ఆర్‌ఆర్ కాలనీ లో స్థలాలు కేటాయించడం జరిగిందని తెలిపారు. నూతన గృహ నిర్మాణాలు చేపట్టేందుకు మంచి ముహూర్త లేనందున నిర్వాసితులు గృహాలు నిర్మించేందుకు ఆసక్తి కనబరచడం లేదని, లబ్ధిదారుల విజ్ఞప్తి మేరకు నివాస గృహాలు ఖాళీ చేసి, నూతనంగా నిర్మించేందుకు గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న నేతలు

తహసిల్దార్ నరసింహమూర్తి మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. పునరావాస కాలనీకి వెళ్లేందుకు గడువు పెంచాలని హోంమంత్రి వంగలపూడి అనితను కూడా కోరినట్లు నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల యువత అధ్యక్షులు కమ్మెల శివరామకృష్ణంరాజు, నాయకులు ఎరిపల్లి అప్పలరాజు, కుర్ర బాబ్జి, హరిక పాల్గొన్నారు.



అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు మన్నాజీ

హైస్కూల్‌కు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు, ఆంధ్ర క్రికెట్ కోచ్ ప్యానెల్ మెంబెర్ మన్నాజీ స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. సోమవారం పాఠశాల హెచ్ఎం హెచ్ఎం జయశ్రీ, పీడీ అమ్మాజీలకు స్పోర్ట్స్ కిట్లును అందజేశారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, టీ షర్టులు అందజేస్తానని వెల్లడించారు. విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల్లోనూ కూడా రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. 2002 లో ఆయన ఈ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులుగా పనిచేసారు. స్పోర్ట్స్ కిట్లు అందజేసినందుకు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎస్ఐతో వైసిపి నాయకులు

ఎస్ఐని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఎస్సైగా నియమితులైన రిషికేశ్వరరావును వైసీపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీహెచ్.నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు, లింగంపేట సర్పంచ్ తోకల సంతోష్ కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు మరింత చేరువగా పని చేస్తూ పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెంచేలా సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగాపురం ఉప సర్పంచ్ పి.సుబ్రహ్మణ్యం, లంక లోవనారాయణ, లంక శివ, వాసం లోవ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గొలుగొండ:భూతగాదాల విషయంలో పోలీస్ స్టేషన్, కోర్టుల్లో సంవత్సర కాలంగా ఉన్నా సమస్యలు ప్రజా వేదిక ద్వారా సామరస్యంగా ్వ రెవెన్యూ అధికారులు వేగవంతంగా పరిష్కారం చూపాలని సిపిఐ మండల కార్యదర్శి జి.రాధాకృష్ణ అన్నారు. సోమవారం డిప్యూటీ తహశీల్దార్ చైనులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రాధాకృష్ణ మాట్లాడుతూ, పాతమల్లంపేట పంచాయతీ చంద్రయ్యపాలెం గ్రామ సర్వే నెంబర్ 936-4, 5లో 9 ఎకరాల భూమి గిరిజన వారసులుగా సుమారు 100 సంవత్సరాలు పూర్వకాలం నుండి బంజర భూమి సాగు చేసుకుంటూ చంద్రయ్యపాలెంలో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. 1956 సంవత్సరంలో డి పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. 1967 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని, 2000-2025 మధ్యకాలంలో పట్టాలు పొందారన్నారు. గిరిజనులకు నోటీసులు ఇవ్వకుండా 2000 సంవత్సరం నుండి నేటి వరకు పోలీస్ స్టేషన్, కోర్టులని ఇరువర్గాల వారిని ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు కూడా దొర, గిరిజన రైతులు దారబాబు, అప్పలనాయుడు వీరబాబు, పెదబాబులు, రమణ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నేతలు

తుపాను సాయం అందించాలి : సిపిఎం



వినతిపత్రాన్ని ఇస్తున్న సిపిఎం నేత గోవిందరావు

ప్రజాశక్తి-రోలుగుంట:మొంథా సాయం ఇంకెప్పుడిస్తారని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు ప్రశ్నించారు. సోమవారం రోలుగుంట తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం గోవిందరావు మాట్లాడుతూ రోలుగుంట మండలం అర్ల పంచాయితీ లోసింగి, పెద్దగరువు పీవీటీజీ ఆదివాసీ కొంద గిరిజనులకు మొంథా తుఫాన్ సమయంలో శరభవరం ఎంపీపీ స్కూల్‌లో రిలీఫ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారని, ఆ సెంటర్లోని బాధితులకు ప్రభుత్వం నిత్యావసర సామగ్రి అందజేసిందన్నారు. కుటుంబంలో ఒకరుంటే రూ.1000, ముగ్గురు కంటే అధికంగా ఉంటే రూ.3వేల ఆర్థిక సాయం చేస్తామని కూడా సర్కార్ ప్రకటించిందని తెలిపారు. అధికారులు కూడా లబ్ధిదారులు బ్యాంకు ఖాతాల వివరాల్నీ తీసుకున్నారని, అలా జరిగి నెల రోజులువుతున్నా నేటికి పరిహారం బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. సొమ్ముల కోసం రోజూ బ్యాంకు ఖాతాల్ని పరిశీలిస్తున్నామని, కేవలం రెండు కుటుంబాలకు మాత్రమే డబ్బు జమ అయిందన్నారు. అందరికీ మంజూరయ్యేలా చూడాలని కోరారు.

విద్యార్థినులకు ఆత్మరక్షణ శిక్షణ

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల భద్రత, శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు సెల్ఫ్ డిఫెన్స్ (ఆత్మరక్షణ) శిక్షణా కార్యక్రమంను సోమవారం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు టివి. శేషగిరిరావు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పీవీఎం.నాగజ్యోతి ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఆడపిల్లలకు ఆత్మరక్షణ అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని, ఈ కార్యక్రమానికి ప్రత్యేక శిక్షకుడిగా మురళీకృష్ణ డీఈఓను అధికారికంగా నియమించారన్నారు.. విద్యార్థినులకు అత్యవసర పరిస్థితుల్లో తమను తాము రక్షించుకునే నైపుణ్యాలు అందించడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ శిక్షణ ప్రతి వారం రెండు రోజులపాటు జరగనుందని హెచ్ఎం శేషగిరిరావు తెలిపారు. తరగతుల రూపంలో సిస్టమాటిక్‌గా ఇవ్వబడే ఈ శిక్షణ ద్వారా విద్యార్థినులు మానసిక ధైర్యం, శారీరక శక్తి, తక్షణ స్పందన, అవగాహన వంటి నైపుణ్యాలలో దక్షత్వ సాధిస్తారని తెలిపారు.



శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

ప్లాస్టిక్‌తో ముప్పు

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని సాగరం కాలనీలో మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవా శిబిరం మూడవ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు వివరిస్తూ గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ ఆఫీషర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో మహిళకు మరియు వాలంటీర్లుకు రక్త పరీక్షలు చేసి రక్తహీనత కలిగిన వారికి తగిన మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచి జయమ్మ, గ్రామ పెద్దలు, కళాశాల ఉపన్యాసకులు బి.రాజు, వి.అప్పలనాయుడు, ప్రోగ్రాం అధికారి రామ్కుమార్ పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు



వినతిపత్రాన్ని చూపుతున్న సర్పంచ్

డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి: రావికమతం:మండల కేంద్రంలో డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కారం చేయాలంటూ అనకాపల్లి జిల్లా కలెక్టర్కు సోమవారం ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ గంజి మంగ మోదీ నాయుడు తెలిపారు. మండల కేంద్రంలో డంపింగ్ యార్డ్ స్థల సమీకరణ జరగక పోవడంతో తహసిల్దార్ కార్యాలయం సమీపంలో గుట్టల గుట్టలగా చెత్తను వేస్తున్నారన్నారు. ఈ విషయమై పలుమార్లు వార్తాపత్రికలలో కూడా ప్రచురితమైన విషయం తెలిసిందేనన్నారు. విద్యుత్తు సబ్‌స్టేషన్ వైపు, గ్రామం నలుమూలల ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారంతో గ్రామం అంతా నిండి ఉందని తెలియపరచడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. గ్రామం పరిశుభ్రంగా ఉండాలంటే డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి సంబంధించి సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి పార్టీ ప్రెసిడెంట్ దండి పాటి నాగరాజు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు కోసిరెడ్డి వెంకట సత్యనారాయణ, బూత్ ఇంచార్జ్ గంజి అప్పలనాయుడు, వార్డు మెంబర్ గంజి రమేష్, కంఠం రెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



చర్చిస్తున్న మండల మానిటరింగ్ టీమ్

హైస్కూల్‌ను సందర్శించిన మానిటరింగ్ టీమ్

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల మోనిటరింగ్ టీమ్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులకు సంబంధించి వందరోజుల ప్రణాళికలు పాఠశాలలో ఏ మేరకు అమలు జరుపుతున్నారో అనే విషయాన్ని క్షుణంగా పరిశీలించారు. చదువులో విద్యార్థుల నైపుణ్యం, రాత పుస్తకాలు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం తనిఖీ చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు కే నరేష్, రుత్తుల నాగన్న దొర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.బాలాజీ, ఉపాధ్యాయులు ప్రభావతి, రమణీకుమారి, వైవి రమణ, రమేష్, ప్రభాకర్, శేషగిరిరావు, ఏసుదేవుడు పాల్గొన్నారు.

డ్రైయినేజీ నిర్మాణ పనులు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో కొత్తకోట అంబేద్కర్ కాలనీ లో డ్రెయినేజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మండల పరిషత్ జనరల్ నిధుల నుంచి నాలుగు లక్షల రూపాయలతో డ్రైన్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని కొత్తకోట ఎంపిటిసి 1 పూడి దేవ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ కాలనీలో సీసీ డ్రెయిను సమస్య అధికంగా ఉండడంతో ఈ నిధులను ఈ కాలనీ కు ఉపయోగించడం జరిగిందని ఆయన తెలిపారు.

బైక్ దగ్ధంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- నక్కపల్లి:బైక్ దగ్ధమైన సంఘటనపై మండలంలో చినతీనార్ల గ్రామానికి చెందిన గరికిన రాము సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త మృతి చెందిన తర్వాత బైక్ ను తన సోదరుడు చొక్కా ప్రసన్నకుమార్ నడుపుతున్నాడని, ఆదివారం రాత్రి యధావిధిగా ఇంటిదగ్గర పార్కింగ్ చేయడం జరిగిందని తెలిపారు. సోమవారం ఉదయం చూడగా తన ఇంటికి 100 మీటర్ల దూరంలో బైకు దగ్ధమై ఉందని, గ్రామానికి చెందిన ఒక వ్యక్తి బైక్ ను దగ్ధం చేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ రాము పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

కోతుల బారి నుంచి రక్షించాలి

ప్రజాశక్తి- రావికమతం:మండల కేంద్రంలో ఎస్సీ, బీసీ హాస్టల్ విద్యార్థుల పై కోతులు దాడి చేస్తున్నాయని, వీటి నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే.గోవిందరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థులు కోతులు దాడికి గురయ్యారన్నారు. వీరిని రావికమతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించడం జరిగిందన్నారు. హాస్టల్ సమీపంలో ఉన్న బీసీ కాలనీ వాసులపై కూడా ఇళ్లలోకి చొరబడి తినుబండారాలను లాక్కొని వారిపై దాడి చేస్తున్నాయన్నారు.సోమవారం చీమలపాడు పంచాయితీలోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. దీంతో పిల్లలు చాలా భయంతో బిక్కుబిక్కు మంటూ హాస్టల్లో జీవనం గడుపుతున్నారన్నారు.వీటి నియంత్రణకు చర్యలు చేపట్టవలసిన అధికారులు నేటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం చాలా దారుణమన్నారు. కోతులన్నింటిని పట్టించి వాటిని జూ ప్రదేశంలో వదిలిపెట్టినట్టయితే ఇటు రైతాంగానికి, ప్రజలకు, విద్యార్థులకు ఎవరికి హాని కలగకుండా ఉంటుందని ఆయన తెలిపారు. కోతుల బారి నుండి బయటపడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న యూనియన్ నేతలు

12న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:అంగన్వాడీలు ఎదుర్కొం టున్న సమస్యలపై ప్రభుత్వానికి నివేదించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఐసిడిఎస్ ఆఫీస్ అధికారి ప్రసాద్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కనీస వేతనాలు 26,000 అమలు చేయాలన్నారు. అంగనవాడీలకి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్ ఇవ్వాలనే తదితర డిమాండ్లతో 12 న అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద జరుగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శి లు మహాలక్ష్మి, రమణమ్మ, కృష్ణవేణి, నాగమణి, వరలక్ష్మి పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

సహకార సంఘాల ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి మాడుగుల:సహకార సంఘాల ఉద్యోగులు, రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు సోమవారం ఉదయం మాడుగుల డీసీసీబీ బ్రాంచ్ వద్ద ధర్నా నిర్వహించారు. జీవో నెంబర్ 36ను వెంటనే అమలు చేయాలని, ఉద్యోగులందరికి ప్రొసీడింగ్స్ ఇచ్చి డిఎస్ఎస్ఎఫ్ ఏర్పాటుతో జీతభత్యాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులకు ప్రతి ఐదు సంవత్సరాలకు వేతన సవరణ చేయాల్సి ఉందన్నారు. . ఇలా పలు సమస్యలపై బ్యాంక్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని జేపీ.అగ్రహారం పాఠశాల పూర్వ విద్యార్థి పెట్ల సత్యనారాయణ రూ.30వేల విలువ గల బీరువాను సోమవారం పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే దీనికి పూర్తి సహకారం అందించిన జేపీ.అగ్రహారం ప్రెసిడెంట్ సీహెచ్.వెంకటసత్యనారాయణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయాలి



గొలుగొండలో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ నెల 31 నుండి జనవరి 4వ తేదీన విశాఖలో జరిగే సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని గొలుగొండ మండలం ఏఎల్.పురం వారపు సంతలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మంగతాయారు, రైతు సంఘం జిల్లా నాయకులు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు పని గంటల పెంపును అబివృద్ధి చేయాలని, తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లకి అంగన్వాడి, ఆశ, మధ్యాహ్నం భోజనం, తదితర కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. స్కీం వర్కర్లకి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జనవరి 4వ తేదీన వైజాగ్ ఆర్కే బీచ్ లో జరిగే బహిరంగ సభను కార్మికులు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి, దంట్ల శివ, కెవిపిఎస్ నాయకులు కే.కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

మాధవధార : విశాఖలో ఈనెల 31నుంచి వచ్చేనెల 4 వరకు నిర్వహించే సిఐటియు అఖిల భారత 18వ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జోన్ అధ్యక్షులు ఎస్.శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం మాధవధార మున్సిపల్ వార్డు కార్యాలయాల వద్ద మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సిఐటియు ఆవిర్భావం తర్వాత మొట్టమొదటిసారి ఆంధ్రరాష్ట్రంలో విశాఖపట్నంలో మహాసభ జరుగుతున్నాయన్నారు. చారిత్రాత్మక . మహాసభకు పెద్ద ఎత్తునకార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. దేశంలో కార్మిక సమస్యలపై సిఐటియు నిత్యం అలుపెరగని పోరాటాలు చేస్తోందన్నారు. లేబర్‌కోడ్స్ అమలు వంటి కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న తరుణంలో విశాఖలో సిఐటియు జాతీయ మహాసభకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, 8 గంటల పని దినం పునరుద్ధరణ, లేబర్‌కోడ్స్ రద్దు వంటి వాటిపై మహాసభలో చర్చ జరిగి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ఉంటుందన్నారు. వచ్చేనెల 4న ర్యాలీ, ఆర్‌కె బీచ్‌లో బహిరంగ సభ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డ్ నాయకులు రమణ, అప్పలరాజు, ఎంకే లక్ష్మి, లక్ష్మణ్,ఈశ్వరరావు, శివ, దేవి, లక్ష్మి, పాపారావు ,పోలయ్య, దాలయ్య, బంగారయ్య, బాలరాజు, సత్యవతి, ధన పాల్గొన్నారు.

ములగాడ : సిఐటియు అఖిల భారత మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ 63వ వార్డు యారాడ బస్టాప్ వద్ద ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. సిఐటియు మల్కాపురం జోన్ ప్రధానకార్యదర్శి ఆర్. లక్ష్మణమూర్తి ఆటో స్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు పట్నాల నూకరాజు, కొల్లి కుమార్, కమిటీ సభ్యులు కె. నాగరాజు ఎ.పైడిరాజు ఎం. ప్రసాద్ వి. త్రినాథ్ సుల్తాన్ సిఐటియు మల్కాపురం జోన్ నాయకులు కె. పెంటారావు, ఎ..సత్యారావు పాల్గొన్నారు.



మాధవధారలో నినాదాలు చేస్తున్న మహిళా కార్మికులు

సబ్బవరం : విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు జరుగుతున్న సిఐటియు అఖిలభారత 18వ మహాసభల వాల్ పోస్టర్‌ను సోమవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిసెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ మహాసభ జయప్రదానికై కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు సహకారం అందించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ మహాసభల్లో పలు తీర్మానాలు చేయడంతో పాటు భవిష్యత్తు పోరాటాలకు రూప కల్పన జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ వివి రమణమ్మ, నాయకులు వరలక్ష్మి, బి. రమణమ్మ, మొల్లేటి గౌరేష్ తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ, మహిళలు

విత్తన, విద్యుత్ బిల్లులను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్న విత్తన బిల్లు, విద్యుత్ బిల్లును తక్షణమే రద్దు చేయాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు సోమవారం అనకాపల్లి జిల్లా కేంద్రం నెహ్రూ చౌక్ జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన తెలియజేసి, బిల్లుల ప్రతులను దహనం చేశారు. మోర్చా నాయకులు గండి నాయనబాబు, రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ సీడ్ బిల్లుపై రైతులు, రైతు సంఘాలు అభిప్రాయాలు చెప్పటానికి 6 నెలల గడువు పెంచాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతే పరిహారం ఇచ్చేలా చట్టంలో నిబంధన పొందుపరచాలని కోరారు. విత్తన బిల్లును మోడల్ చట్టంగా చేసి రాష్ట్రాలు తమ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మార్చుకునే అవకాశం కల్పించాలన్నారు. విత్తన ధరలు, సరఫరా, నియంత్రణ రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలని, నకిలీ విత్తనాలకు జరిమానాతో పాటు ఐదేళ్ళు నిషేధం విధించాలని నిబంధన ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోర్చా నాయకులు రాజాన దొరబాబు, తాకాశి వెంకటేశ్వరరావు, వియ్యపు రాజు, వైఎన్ భద్రం, కోరుబిల్లి శంకర్రావు, పప్పల ఈశ్వరరావు, నరాలశెట్టి సత్యనారాయణ, కందుబోతుల బుజ్జి పాల్గొన్నారు.

ఏపి రైతు సంఘం ఆధ్వర్యాన..

అచ్యుతాపురం : నూతన విద్యుత్, విత్తన బిల్లులపై సోమవారం అచ్యుతాపురం మండలంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నూతన విద్యుత్తు బిల్లుల ప్రతులను దగ్ధం చేశారు. కొండకర్ల, తిమ్మరాజుపేట రైతులతో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు మండల కన్వీనర్ కె సోమునాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ బిల్లు, విత్తన బిల్లు రెండూ కూడా వ్యవసాయ రంగంపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని తెలిపారు. ఈ విద్యుత్ బిల్లు వల్ల దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రైవేటుపరం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ దూరమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నరగడం రామనాయుడు, పి.నాగేశ్వరరావు, వై.తార్కేశ్వరరావు, బి.అప్పలనాయుడు, సిహెచ్.గోవింద్, ఎస్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



బిల్లుల ప్రతులను దహనం చేస్తున్న రైతు సంఘం నేతలు, రైతులు

చిన్నారుల ఆధార్ నమోదు వేగవంతం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చెయ్యాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆధార్ కార్డుల నమోదు, నవీకరణ ప్రక్రియపై జిల్లా స్థాయి ఆధార్ కమిటీ సమన్వయ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడి కేంద్రాలలో ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డు నమోదు తక్షణమే చేపట్టాలన్నారు. తల్లి బిడ్డకు జన్మనివ్వగానే వైద్యశాలలోనే ఆధార్ నమోదు చేయాలన్నారు. ఏదైనా కారణం చేత నమోదు కాలేకపోతే అంగన్వాడి కేంద్రం పరిధిలోనే ఆధార్ నమోదు తప్పనిసరిగా జరగాలన్నారు. ఐదు నుంచి ఏడు సంవత్సరాల లోపు బాలలకు బయోమెట్రిక్ నవీకరణ విధిగా నిర్వహించాలన్నారు. లేకుంటే ఆధార్ కార్డులు రద్దయే అవకాశం ఉందని చెప్పారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 15 నుంచి 17 సంవత్సరాల లోపు యువతి యువకుల ఆధార్ కార్డులలో బయోమెట్రిక్ నవీకరణ తప్పనిసరిగా చేపించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 23,891 ఐదు నుంచి ఏడేళ్లలోపు బాలలు ఆధార్ కార్డులు నవీకరణ పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ వై. సత్యన్నారాయణ రావు, జిల్లా గ్రామ వార్డు సచివాలయల సమన్వయ అధికారి మంజులవాణి, డిఇఒ జి అప్పారావు నాయుడు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హైమావతి, సంక్షేమ శాఖ పిడి జిల్లా ఆధార్ కోఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.